క్లుప్తంగా

సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదన

పాల్వంచరూరల్: రైతుల సౌకర్యార్థం పెద్ద ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను విభజించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పాల్వంచ మండలంలో మూడు సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం పాల్వంచలో పాల్వంచ సహకార సంఘం ఒక్కటి మాత్రమే ఉండంతో నూతనంగా యానంబైల్, పాండురంగాపురం, నాగారం సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు డీసీఓ ఖుర్షీద్ తెలిపారు. ప్రభుత్వం మూడు సొసైటీలను ఏర్పాటు చేస్తే మండలంలో మొత్తం సొసైటీల సంఖ్య నాలుగుకు పెరగనుంది.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

జూలూరుపాడు: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు బానోత్ మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒకటైన రేషన్ కార్డులను మంజూరీ చేయాలన్నారు. రేషన్ కార్డుల కోసం చాలామంది ప్రజాపాలన, జీపీల్లోనూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో అతికొద్ది మంది పేర్లు ఉండటం నిరాశకు గురిచేసిందన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియా, కాదా? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

21న లెనిన్ శత వర్ధంతి సభ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: 21న హైదరాబాద్‌లోని సందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, జిల్లా నాయకుడు వై గోపాల్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జూలూరుపాడులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయల సిద్ధు, బానోత్ ధనవంతరావు, తోటకూరి నరేష్, బొర్రా వెంకటేశ్వర్లు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిగా ఉపయోగపడుతుంది..



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు: ప్రతీ ఉపాధ్యాయుడికి క్యాలెండర్, డైరీ, టేబుల్ క్యాలెండర్, జీఓ బుక్ మార్గదర్శిగా ఉపయోగపడుతుందని, వీటిని ప్రతీ ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్.పూర్ణచందర్‌రావు అన్నారు. శనివారం ఇల్లెందులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్, జీఓ బుక్‌లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... వృత్తిలో తలెత్తే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈ డైరీ, క్యాలెండర్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాగ్యారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రాం, సర్వేశ్వరరావు, సభ్యులు రాజారత్నం, జగన్, రాములు, వెంకట్రాం, కిషన్, శివ, సమ్మయ్య, ఈశ్వర్, పూర్ణిమ, రాజా రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ తోట లలిత శారద భర్త తోట రమేష్ (60) గుండెపోటుతో మృతి చెందారు. రమేష్ మాజీ సింగరేణి ఉద్యోగి, కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం తీవ్ర అనారోగ్యం పాలుకావటంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రమేష్‌కు భార్య లలిత శారద, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, దిండిగల రాజేందర్, కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, కటకం పద్మావతి, మున్సిపల్ చైర్మన్ డీవీ, వైస్ చైర్మన్ జానీపాషా, బీఆర్‌ఎస్ నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, శీలం రమేష్, అబ్దుల్ నబీ, పోషం, గిన్నారపు రాజేష్, రేణుక, వరప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పట్టణంలో నీటి కష్టాలు

- 'గూడెం'లో ఐదు రోజులుగా సరఫరా బంద్
- పైపులైన్ మరమ్మతులు ఆలస్యం
- అవస్థలు పడుతున్న ప్రజలు



భజన మందిరం రోడ్డులో కిన్నెరసాని పైపులైన్ లీకేజీ కావడంతో తవ్విన దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో ఐదు రోజులుగా నీటి సరఫరా కాకపోవడం వలన పట్టణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక నెలలో రెండు, మూడుసార్లు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇంటి అవసరాలకు కూడా నీరు లేక అవస్థలు పడుతున్నారు. తరుచుగా కిన్నెరసాని పైపులైన్లు లీకేజీలు అవడం, పగిలిపోవడం జరుగుతుండడం వలన ప్రజలకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. నెల, రెండు నెలలకు ఒక్కసారి ప్రత్యేకంగా పట్టణంలోని సెవెన్‌హిల్ ఏరియా నుంచి గాజులరాజం బస్తీ వరకు ఉన్న ప్రాంతంలోనే మున్సిపల్ సిబ్బంది పైపులైన్ల లీకేజీ పనులను చేపడుతున్నారు. మిగతా చోట్ల ఎప్పుడో ఒకసారి లీకేజీలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోనే తరుచు పైపుల లీకేజీలు అవడం పట్ల ఆయా వార్డుల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల కోసం పనులు చేస్తున్నారా.. లేదంటే నిజంగానే లీకేజీ జరుగుతోందా తెలియని పరిస్థితి నెలకొంది. గత నెలలో కూడా సెవెన్‌హిల్స్ ఏరియాలో ప్రధాన రోడ్డుపై పైపులైన్ లీకేజీ అవుతోందని, అందులో మురుగు నీరు కలుస్తోందని, దాదాపు పది రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం అదే రోడ్డులో కొంతదూరంలో పైపులైన్ లీకేజీ కావడంతో ఐదు రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారు. ప్రధాన పైపులైన్ కావడం వలన దాదాపు పదికి పైన వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపుల లీకేజీ పనులు నాణ్యతంగా చేపట్టకపోవడం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. పనులు జరిగే సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా పనులు చేయడం వలన తరుచుగా పైపులైన్ లీకేజీలు అవుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి పనులు జరిగే సమయంలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కిన్నెరసాని నీరే ఎక్కువగా..

కొత్తగూడెం పట్టణంలోని 36 వార్డుల్లోని 80 శాతం ప్రజలు ఎక్కువగా కిన్నెరసాని నీటిని తాగునీరుగా వినియోగించడం, ఇంటి అవసరాలకు ఉపయోగిస్తారు. మిగతావారు సింగరేణి నీటిని, మినరల్ వాటర్‌ను తాగునీరుగా వినియోగిస్తారు. ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో కిన్నెరసాని నీరు తాగే ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లకు వెళ్లి నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుని మంచినీరుగా వినియోగిస్తున్నారు. ఐదు రోజులుగా నీటి సరఫరా బంద్ కావడంతో ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వార్డులకు నీటి ట్యాంకర్లను పంపించాలని వార్డు కౌన్సిలర్లు డిమాండ్ చేసినప్పటికీ అధికారులు ట్యాంకర్లను పంపించకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బోరు ఉన్న వారి ఇంటికెళ్లి బిందెలతో నీటిని తీసుకెళ్తున్నారు. వేసవికాలానికి రెండు నెలల ముందే నీటి కష్టాలు మొదలయ్యాయని, వేసవిలో ఇంకెంత ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

లీకేజీలకు ప్రతీనెల నిధులు కేటాయింపులు...

పట్టణంలో కిన్నెరసాని నీటి పైపులైన్ల లీకేజీల మరమ్మతుల కోసం ప్రతీనెల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు కేటాయిస్తున్నారు. ఆ డబ్బుతో నాసిరకం పనులు నిర్వహించి వృథా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ లీకేజీ అయిన ఏరియాలోనే కొంతదూరంలో నెలలో మరోసారి లీకేజీ అవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైపులైన్ల లీకేజీ పనులు బిల్లుల కోసం కాకుండా, ప్రజల అవసరాలు తీరే విధంగా వెంటనే చేసేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంక్రాంతి పండుగ రోజున పైపులైన్ లీకేజీ అయితే కాంట్రాక్టర్, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వలన మరమ్మతుల పనులు ఆలస్యంగా జరిగాయి. తాగునీరు నిత్యావసరం కాబట్టి పైపులైన్ల మరమ్మతుల పనులలో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటున్నారు. పట్టణ ప్రజలు.

కమిషనర్ ఏమన్నారంటే..

భజన మందిర రోడ్డులో కిన్నెరసాని పైపులైన్ మరమ్మతుల విషయంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామిని వివరణ కోరగా.. పైపులైన్ మరమ్మతులు పనులు పూర్తయ్యాయని ఆదివారం లోగా నీటి సరఫరా అయ్యే విధంగా చూస్తామని తెలిపారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి, లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కొత్తగూడెం జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న రేషన్‌కార్డుల సర్వేను జెడ్పీ సీఈఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ టి.తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి బస్వతారక కాలనీ పంచాయతీలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను శనివారం కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాల అమలు కోసం అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని 21వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి ఎంపికైన లబ్ధిదారులకు 26వ తేదీ నుంచి మంజూరు పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి, ఏపీఎం ఎస్.రాంబాబు, కార్యదర్శి అజ్మీరా రాంబాబు, కొండం వెంకన్న, గంధం నర్సింహారావు, పి.మహేష్, కాపర్తి వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు నిబంధనలకు లోబడి పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది గ్రామాలలో పర్యటిస్తున్నారు. పలు గ్రామాలలో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్ తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు.

ఎన్‌టీఆర్‌కు పలువురి నివాళి



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న నాయకులు


కొత్తగూడెంటౌన్: మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం సెవెన్ హిల్స్ ఏరియాలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు కనుకుంట్ల కుమార్ పూలమాల వేసి నివాలర్పించారు. కళ్యాణం, లక్ష్మీపతి, అప్పారావు, ఎండీ అక్బర్‌పాషా, దుర్గారావు గౌడ్, కిరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పాపకొల్లు, జూలూరుపాడు, కాకర్ల గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోకటి రంగారావు, అరెం రామయ్య, చలమల గోవిందు, వడ్డే వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇల్లెందు: మాజీ సీఎం ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో శనివారం 100 మంది రక్తదానం చేశారు. ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్‌బాబు, శ్యాం, నర్సయ్య, నాగరాజు, నవీన్, శ్రీవేద్, ప్రణయ్, అశోక్, పుట్టా ఉపేందర్ యాదవ్, క్లింట్ రోచ్ పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

టేకులపల్లి: టేకులపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, అభిమానులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుడిపూడి మోహన్‌రావు, గజ్జల రామశేఖర్, గోరంట్ల రవి, మోత్కూరి సతీష్, రాయల రాజేష్, కనగాల సతీశ్, మూడు కృష్ణ, అనిల్, భద్రూ పాల్గొన్నారు.

కిన్నెరసానిలో విద్యార్థుల సందడి



కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద చిన్నారుల కోలాహలం

టేకులపల్లి: రాంపురం పంచాయతీ పాతతండాలోని ముత్యాలంపాడు (హరిజన చెర్రి) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం కిన్నెరసాని అభయారణ్యానికి పిక్నిక్‌కు వెళ్లారు. చిన్నారులకు ఉపాధ్యాయులు సుందర దృశ్యాలు, కిన్నెరసాని ప్రాజెక్టు, జింకల పార్క్ చూయించారు. బోటు షికారు చేయించారు. కిన్నెరసాని విశిష్టతను వివరించారు. అనంతరం ఆటపాటలతో చిన్నారులు సందడి చేశారు. సహపంక్తి భోజనం చేశారు. కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎల్.లక్ష్మణ్, టీచర్ వై.అనురాధ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఇల్లెందు: నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం ఇల్లెందులోని జేబీఎస్ స్కూల్, జేకే సింగరేణి హైస్కూల్‌లోని రెండు కేంద్రాల్లో 386 మందికిగాను 59 మంది గైర్హాజరయ్యారు. ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాలతో పాటు కారేపల్లి మండలం నుంచి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలను మండల స్థాయిలో ఎంఈఓ టీవీఆర్ఎస్ స్వామి పర్యవేక్షించారు.


డ్రాయింగ్ పోటీలో ఫర్హానా ప్రతిభ



ఫర్హానాను అభినందిస్తున్న టీచర్లు

పాల్వంచ రూరల్: పెన్సిల్ ఆర్ట్ పోటీలో పాల్వంచకు చెందిన యువతీ ప్రతిభ చాటింది. పాల్వంచకు చెందిన ఫర్హానా ఏపీలోని గుంటూరు జిల్లా పిడుగురాళ్లలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా పని చేస్తోంది. ఈ మేరకు ఈ నెల 17, 18 తేదీలలో హైదరాబాద్ విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో ఫెవిక్రిల్ ఆధ్వర్యంలో జరిగిన పెన్సిల్ ఆర్ట్ పోటీల్లో ఫర్హానా మూడో బాహుమతిని గెలుచుకుంది. ఈ మేరకు శనివారం పాల్వంచలోని విజ్ఞాన్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సొందు, టీచర్లు ఫర్హానాను అభినందించారు.

డీజీఎంకు సన్మానం



హరినారాయణను సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా స్థాయిలో షటిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన డీజీఎం (ఫారెస్ట్) ఏబీ.హరినారాయణను జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కే.శ్రీనివాస్‌రావు శనివారం తన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ డిసెంబర్ 27 నుంచి 29 వరకు ఎస్ఈసీఎల్ ఆధ్వర్యంలో బిలాస్‌పూర్‌లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ వెటరన్ డబుల్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి సింగరేణి కీర్తిని కోలిండియాలో ఇనుమడింపజేశారని కొనియాడారు. తోటి క్రీడాకారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రానున్న క్రీడా పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, కార్పొరేట్ వైస్ ప్రసిడెంట్ పీతాంబరం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనందమేళోత్సవం

ఇల్లెందు: పట్టణంలోని కళాసీ బస్తీ 18వ వార్డులో శ్రీ కుసుమ హరనాథ భక్త బృందం ఆధ్వర్యంలో 80వ ఆనందమేళోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రత్యేక కీర్తనలో పూజా కార్యక్రమం ప్రారంభం కాగా పుల్లూరు స్వరాజ్యగుప్త జ్యోతి ప్రజ్వలన చేశారు. మాట్లాడుతూ... మూడు రోజులు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, ముగింపు రోజు రాత్రి పట్టణంలో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రచార సంస్థ హైదరాబాద్ అధ్యక్షుడు తోట కరంచంద్, ఆర్.నరసింహరావు, ఆర్.వీరభద్రరావు, పుల్లూరి హరినాథ్, సదానందం, రామ్మోహన్‌రావు, సురేష్, నవీన్, రవి, జొన్నల ఉపేంద్రనాథ్, జ్యోతి, సుజాత, నవ్యశ్రీ, శ్రీజ, ఉమ, రాజశ్రీ, మౌనిక, హిమబింధు, హరిణి, రమ్య, భక్తులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వరాజ్యగుప్త

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

జూలూరుపాడు: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాయల సిద్ధు అన్నారు. శనివారం జూలూరుపాడులో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఈనెల 20న టేకులపల్లి మండల కేంద్రంలో జరగనున్న యూనియన్ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలకు వరం కాగా, ఆటో, క్యాబ్, జీప్ డ్రైవర్లకు శాపంగా మారిందన్నారు. ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు నేలాల నవీన్, కత్తి సాయి, నేలాల సీతారాములు, నూకపోగు రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం..



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న శోభ

కొత్తగూడెంఅర్బన్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు కీలక పాత్ర పోషిస్తోందని బ్యాంకు చైర్మన్ వై.శోభ అన్నారు. శనివారం ఆమె జిల్లాలో పర్యటించి, రామవరం శాఖను ప్రారంభించారు. మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, మహిళా సంఘాలు, గ్రామీణ ప్రాంతంలోని వ్యాపారులకు సేవలందించడంలో బ్యాంకు ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. మహిళా సంఘాల రుణాల నిమిత్తం కొత్తగూడెం క్లస్టర్ తరపున రూ.పది కోట్ల చెక్కును స్వయం సహాయక బృందాలకు అందజేశారు. జనవరి 1 నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏపీజీవీబీ శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా సేవలందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ముక్తాపురం ఉదయ్, ఎస్ఎం ఆపరేషన్స్ కె.సుధీర్‌కుమార్‌రాజు, బ్రాంచి మేనేజర్ ఎస్.హేమన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5, 6న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

జూలూరుపాడు: ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో పాల్వంచ పట్టణంలో జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రామ్‌చరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జూలూరుపాడు హైస్కూల్‌లో నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పి.పవన్, సాయి, కిరణ్, చరణ్, హర్ష, నందిని, అఖిల తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

ఇల్లెందు: ఈనెల 25 నుంచి సంగారెడ్డిలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఏ నబీ కోరారు. శనివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో మహాసభల విజయవంతం కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారని తెలిపారు.

ఈ మహాసభల్లో నిర్ణయించిన ప్రతినిధులకే పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేటి కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, ఖాదర్, నాగరాజు, సత్యనారాయణ, భద్రూ, నర్సయ్య, వీరయ్య, కోటేశ్వరరావు, వెంకన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికుల పక్షాన ఉద్యమించిన నేత 'జటంగి'



నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ వర్కర్ల సంక్షేమానికి నిత్యం పరితపించిన నేత జటంగి వెంకన్న అని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ప్రగతిశీల పంచాయతీ వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న అంతిమయాత్ర శనివారం మండలంలోని పోలారం గ్రామంలో నిర్వహించారు. ఎన్డీ, మాస్‌లైన్ నాయకులు, జిల్లాలోని పంచాయతీ కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆవునూరి మధు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుడిగా, కారోబారుగా 30 ఏళ్లుగా పనిచేస్తున్న వెంకన్న పోలారం, మర్రిగూడెం ప్రజలకు విశేషంగా సేవలందించినట్లు చెప్పారు. రాష్ట్ర జేఏసీ నేతగా ఆయన భాగస్వామ్యంలో గతేడాది పంచాయతీ కార్మికులు నిర్వహించిన 34 రోజుల సమ్మెతో కార్మికుల హక్కులపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించారని పేర్కొన్నారు. సమ్మె సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సమయంలో కార్మికలోకానికి ఆయన శాశ్వతంగా దూరమయ్యారని వాపోయారు. ఆయన ఆశయ సాధనలో కార్మికులతోపాటు విప్లవ, కార్మిక శక్తులన్నీ ఉద్యమిస్తాయన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎన్డీ, మాస్‌లైన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, నర్సింహారావు, నరాటి వెంకటేశ్వర్లు, బానోత్ సంతు, సరోజిని, కల్తి సుభద్ర, నాయిని రాజు, యాకూబ్ షావలీ, మోహన్‌రావు, సామేలు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా ఇల్లెందు



శానిటేషన్ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ డీవీ



డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: వచ్చే వర్షాకాలం నాటికి పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఇల్లెందులోని కాకతీయనగర్ సల్లేజ్ డ్రెయిన్ వద్ద శానిటేషన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణ వ్యాప్తంగా విస్తరించి ఉన్న సల్లేజ్ డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలిగించిన తర్వాత వార్డుల్లోని డ్రెయిన్లను కూడా శుభ్రం చేసి బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేస్తారని తెలిపారు. దీని ద్వారా లార్వా వృద్ధి చెందకుండా నిర్మూలించే అవకాశం ఉంటుందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. డ్రెయినేజీల్లో చెత్త వేయరాదని, ప్రతీ ఇంటి ముందుకు స్వచ్ఛ వాహనం వస్తుందని ఆ వాహనంలో చెత్త వేసి స్వచ్ఛ ఇల్లెందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీ, ఏఈ శంకర్, శానిటేషన్ సిబ్బంది, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, యలమందల వీణ, చీమల సుజాత ఉన్నారు.